❖•❖•❖ 31 ❖•❖•❖

# ముళ్ల కిరీటము ధరించిన నుదురు

*“అంతట సైనికులు ... ఆయనకు ఉదారంగు వస్త్రము తొడిగించి, ముండ్ల కిరీటమును ఆయన తల మీద పెట్టి, – ‘యూదులరాజా, నీకు శుభమని’ చెప్పి ఆయనకు వందనము చేయసాగిరి. మరియు రెల్లుతో ఆయన తలమీదకొట్టి, ఆయనమీద ఉమ్మివేసి మోకాళ్లూని ఆయనకు నమస్కారము చేసిరి. వారు ఆయనను అపహసించిన తరువాత ఆయన మీద నున్న ఊదారంగు వస్త్రము తీసివేసి, ఆయన బట్టలాయనకు తొడిగించి, ఆయనను సిలువవేయుటకు తీసికొనిపోయిరి” (మార్కు 15:16–20).*

ముళ్ల కిరీటము గూర్చి సువార్తలలో ముమ్మారు పేర్కొనబడింది (మత్తయి 27:27–31; మార్కు 15:16–20; యోహాను 19:1–3). యూదుల నాయకులైతేనేమి రోమా సైనికులైతేనేమి యేసును సిలువవేయుటతో సంతృప్తిచెందలేదు. దీనికి తోడుగా, ఆ నాటి సంస్కృతిని పాటిస్తూ, ఆయనను కొరడాతో కొట్టారు, అపహసించారు, మరియు అవమానపర్చారు.

పిలాతు, “యూదుల రాజువు నీవేనా?” అని యేసునడిగాడు (యోహాను 18:33). అందుకు యేసు, “నీవన్నట్టు నేను రాజునే సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని; సత్యసంబంధియైన ప్రతివాడును నా మాట వినును” అని సమాధానమిచ్చాడు (యోహాను 18:37, 38).

నిజముగా, యేసు ఒక రాజు మాత్రమే కాదు, కానీ ఆయనే రాజై యున్నాడు “సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును అదృశ్యుడునగు అద్వితీయ దేవుడు” అని పౌలు ఆయనను సంబోధిస్తున్నాడు (1 తిమోతి 1:17). ఆయన పునరుత్థానుడైన తరువాత, యేసు ఎంతో ఉన్నతముగా హెచ్చింపబడ్డాడు, ప్రతి నామమునకు పైనామము నివ్వబడ్డాడు, ఆ నామమును తండ్రియైన దేవుని మహిమార్థమై ఒకనాడు ప్రతి మోకాలు వంగుతుంది మరియు ప్రతి నాలుక ఈ నామమును ఒప్పుకొంటుంది (ఫిలిప్పీయులకు 2:9–11). ప్రకటన గ్రంథంలో ఆయన “రాజులకు రాజును, మరియు ప్రభువులకు ప్రభువును” అని వ్రాయబడి యున్న తెల్లని వస్త్రము ధరించుకొనిన ఒకనివలె వర్ణింపబడ్డాడు (ప్రకటన 19:16). అంత్య కాలములో, యేసు, దేవుని కుమారుడు, సమస్త దేవదూతలతో వచ్చును. అప్పుడు “ఆయన మహిమగల సింహాసనముపై ఆసీనుడై యుండును” మరియు “సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయబడుదురు” (మత్తయి 25:31, 32ఎ). పరస్పరము ఎటువంటి విరుద్ధమేదియును లేకుండా, ఆయనే రాజులందరికి రాజైయున్నాడు!

వారు యేసును అపహసించుటలో, యూదుల నాయకులు రోమా సైనికులతో కలిసి, ఒకటి లేక రెండు ముళ్ల కొమ్మలను తీసికొని వాటిని కలిపి వంకరటింకరగా మలిచి విపరీతంగా హాస్యాస్పదమైన, గుండ్రని కిరీటమును తయారుచేసి ఆయన తల మీద పెట్టారు. కిరీటము ధరించిన ఈ ఆకారముతో, వారు ఆయన రాజత్వమును, ఆయన దైవికమైన స్థానమును అపహసరించుచుండిరి. వారు ఆ కిరీటము ఆయన తలపై నొక్కుచు,

ఆయన యొక్క ప్రత్యేకమైన ప్రముఖతను, మరియు ఆయన ఉనికిని పరిహసించుచుండిరి. ఆయన ఎవరై యున్నాడో మరియు ఏమి చేయుటకు వచ్చాడని చెప్పాడో అదే అంశం వెంటబడుచూ, దేవుడు మానవాళి రక్షణార్థమై కలిగియుండిన నిత్య సంకల్పమును వారు అపహాస్యము చేయుచుండిరి.

*మానవులు చూపించిన ఉచ్ఛరింపశక్యముకాని అగౌరవమును మనమిక్కడ చూచుచున్నాము.* పిలాతు యేసులో ఏ దోషమును కనుగొనలేదు. ఆయన చేసిన ముఖాముఖిలో యేసు చేసిన ఎటువంటి నేరమైనను బయటపడలేదు. మామూలు పరిస్థితులలోనైతే, నిర్దోషియైన ఖైదీ విడుదల చేయబడాలనియు అంతటిలో ఆ తీర్పును ఆపివేయాలనియు పిలాతు ఆజ్ఞాపించియుండవలెను. ఏదిఏమైనా, యూదుల నుండి ఎదురౌచుండిన ఒత్తిడి మూలాన, పిలాతు స్వభావము నలిగిపోయింది. యేసు సిలువవేయబడుటకు మాత్రమే గాక, ఆయన అపహసింపబడి అవమానపర్చబడుటకు సహితము – ఆయన యేసును యూదులకప్పగించాడు. సృష్టింపబడినవాడు, వాని సృష్టికర్తనే అపహసించుటను నీవు ఊహించుకొని జీర్ణించుకొనగలవా? ఇదెంతటి సాహసంతో కూడిన నిర్లక్ష్య స్వభావం!

*యేసు తనను తాను కొలువబడజాలనంతగా తగ్గించుకొని దిగివచ్చుటను ఇక్కడ చూడగలము.* మానవులమైన మనలో ఒకడగుటకు యేసు చేపట్టిన ప్రయాణం, ఖచ్చితంగా అదంతేనని, మానవులకే పరిచారము చేయువాడు కావలసి వచ్చినది; కానీ సిలువ మరణము గూర్చి చెప్పుకొంటే, మానవుని వేడుక కొరకైన వస్తువు కావలిసియున్నదను అర్థము కూడా, దానిలో దాగియున్నది! ఆయన మన రక్షకుడై యుండుటకు, ఆయన రాజత్వము గూర్చి చేయబడిన ఎగతాళిని, ఆయన ముఖముపై గుద్దబడుటను, ఆయనపై ఉమ్మివేయబడటను మరియు సైనికులు హేళన చేయుచూ ఆయన తలపై కొట్టబడుటను, సరదా తీర్చుకొనుటకు నవ్వులాటగా ఆయన అవమానమును అపరిమితంగా అధికంచేయాలని ఆయన ముందర వారు మోకాళ్లూనుటను, యేసు సహించాల్సివచ్చింది. దీనంతటిని భరించుటకు యేసు ఎందుకు ఇష్టపూర్వకంగా సంసిద్ధుడయ్యాడు? కేవలము మన రక్షణ కొరకే.

*మొలబంటి లోతు నీళ్లలో కాళ్ళీడ్చుకుంటూ నడిచివెళ్ళినట్లుగా యేసు పరలోక ఉగ్రతను ఉపశమింపజేయునట్లు నరక ఉగ్రత గుండా ఎంతో ప్రయాసపడుచు వెళ్లాల్సివచ్చింది.* నరక ఉగ్రత సిలువ యొక్క భౌతికమైన – శారీరక బాధలు, చిత్రహింసలు, రక్తము, మేకులు, అపహాస్యము, మరియు ఎత్తిపొడుపులు – పార్శ్వమై యుండినది. నరకము దాని శాయశక్తులా శారీరక అవమానము మరియు బాధలన్నిటిని యేసు మీద కుప్పగా కుమ్మరించింది. పరలోక ఉగ్రత మన పాపములను భరించుచు, సిలువ యొక్క ఆధ్యాత్మిక పార్శ్వమై యుండినది. మ్రానుపై ఆయన శరీరములో మన పాపములను భరించునట్లు రక్షకుడు తనను తాను ఈ ఉగ్రతకు అప్పగించుకొనవలసి వచ్చింది (1 పేతురు 2:24). వాస్తవంగా మన పాపముల ప్రాయశ్చిత్తార్థమై ఆయన తనను తాను అర్పించుకొనుటకు మునుపు, ఆయన మానవ తిరస్కార వస్తువుగా, దుర్మార్గులైనవారి చేతిలో ఒక ఆటబొమ్మలాగ కావలసివచ్చినది.

❖•❖•❖

*బొఇల్లిన్‌కు చెందిన కాడ్‌ఫ్రే (1060–1100) మధ్య యుగములోని యెరూషలేము రాజుగా తన పట్టాభిషేక సమయంలో కిరీటమును ధరించుటకు నిరాకరించాడని జే. సి. లైల్ రచించాడు. రక్షకుడైనవాడు ముళ్ల కిరీటమును ధరించిన పట్టణంలో ఆయన సువర్ణ కిరీటమును ధరించకూడదని ఆయన సహేతుకంగా*

*సెలవిచ్చాడు.[1] జాన్ హస్, ప్రఖ్యాతిగాంచిన సంస్కరణ నాయకుడు, పందెములో ఓడిపోయినవాడు తన తలపై మూడు సైతాను బొమ్మలున్న ఒక కాగితము ఉంచబడి మరణించవలెనని వెలుపలికి తీసికొనివెళ్లబడినప్పుడు ఎటువంటి అసంతృప్తినైనా వెల్లడించుటకు నిరాకరించాడని కూడ చెప్పబడింది. "నా ప్రభువైన యేసు క్రీస్తు, నా నిమిత్తము, ఒక ముళ్ల కిరీటమును ధరించాడు: కాబట్టి, ఆయన నిమిత్తము అపకీర్తితెచ్చు ఈ కిరీటమును నేనెందుకు ధరించకూడదు?" అని ఆయన తనకుతాను చెప్పుకొన్నాడు.[2] నీవు నేనూ మహిమ కిరీటమును ధరించగలుగునట్లు యేసు ముళ్ల కిరీటమును ధరించాడు; నీవూ నేనూ నీతియను తెల్లని వస్త్రము ధరించగలుగునట్లు ఆయన ఎగతాళిని సూచిస్తుండిన ఊదారంగు వస్త్రమును ధరించాడు.*

---

సూచనలు

[1]John Charles Ryle, *Expository Thoughts on the Gospels*, vol. 3, *St. John* (Cambridge: James Clarke & Co., n.d.; reprint, Greenwood, S.C.: Attic Press, 1976), 304. [2]Ibid.